


ఉపాధ్యాయులకు శిక్షణ..

సులువైన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధన చేసేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 8లో



కలుపు మొక్కలకు కళ్లెం !

కాలానుగుణంగా వ్యవసాయం మారుతోంది. మెట్ట పంటల్లో కలుపు నివారణ కోసం మల్చింగ్ షీట్ల వినియోగం పెరుగుతోంది. 10లో



వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో సోమవారం పర్యటించనున్నారు. మంత్రి తుమ్మల సాయంత్రం 5 గంటలకు నగరంలోని 18వ డివిజన్ శ్రీరాంనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 7.30 గంటలకు సూర్యాపేట జిల్లా కోదాడలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరవుతారు. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉదయం 7.15 గంటలకు కల్లూరు నుంచి బయలుదేరి క్రాస్‌రోడ్‌లో ఉన్న శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకుంటారు. 9 గంటలకు వైఎస్సార్ కాలనీలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 59వ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 10.30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం ఎం.వి.పాలెంలో, 11.15 గంటలకు కూసుమంచి మండలం లోక్యాతండాలో ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు. 11.45 గంటలకు కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో తిరుమలాయపాలెం మండల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ వెళతారు.

తుమ్మలను కలిసిన అదనపు కలెక్టర్, డీఎంహెచ్‌ఓ



మంత్రికి పూలమొక్క అందిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంవన్‌టౌన్ : ఇటీవల అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాసరెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందించారు. ఆ తర్వాత డీఎంహెచ్‌ఓ బి.కళావతి బాయి కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ.. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

అండర్ -19 ఖోఖో జట్ల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా జూనియర్ కళాశాల క్రీడల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 ఖో–ఖో జట్లను ఎంపిక చేశారు. జిల్లా బాలుర జట్టుకు విష్ణు, జావిద్, వెంకటేష్, కౌషిక్, కృష్ణ, హుస్సేన్, సాయిచంద్, చరణ్‌తేజ, నరసింహారావు, సుషాంత్, మనోజ్‌కుమార్, రోహిత్, బాలికల జట్టుకు శ్రైమీ, సాయిలలిత, కళ్యాణి, సరస్వతి, నాగచైతన్య, నందిని, పార్వతి, వైష్ణవి, జ్యోతి, రూహి, హాసిని, స్పందన ఎంపికయ్యారు. ఇక ఈనెల 5న సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి అండర్–19 వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ జట్లను ఎంపిక చేస్తామని క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ మూసాఖలీం ప్రకటించారు.

ఆరోగ్య మహిళకు ఆటంకం

- వైద్యుల కేటాయింపు లేక తప్పని ఇబ్బందులు
- ఖమ్మం ఆస్పత్రితో పాటు 12 పీహెచ్‌సీల్లో చికిత్సలు
- జిల్లాలో సత్ఫలితాలు ఇచ్చినా.. తరచూ సమస్యలు
- ప్రత్యేక శిబిరాల్లో సేవలకు వైద్యుల విముఖత



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు, చికిత్స కోసం వచ్చిన మహిళలు

ఖమ్మంవైద్యవిభాగం: మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం గత కొంత కాలంగా బాలారిష్టాలు ఎదుర్కొంటోంది. దీని కోసం ప్రత్యేకంగా వైద్యులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మాతా శిశు ఆరోగ్య కేంద్రం, జనరల్ ఆస్పత్రిలోని విధులు నిర్వర్తించే మహిళా వైద్యులే ఆరోగ్య మహిళ కార్యక్రమంలోనూ సేవలందిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమం కోసం నిర్వహించే శిబిరాల్లో చికిత్సలు చేసేందుకు మాత్రం వైద్యులు అంతగా సుముఖత చూపడం లేదు. ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద జిల్లాలో 12 పీహెచ్‌సీలతో పాటు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు అందుతున్నాయి. వివిధ పీహెచ్‌సీల నుంచి వచ్చే రిఫరల్ కేసులతో పాటు సాధారణంగా ఏ మహిళ వచ్చినా ఇక్కడ చికిత్సలు చేస్తారు. కాగా పీహెచ్‌సీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రతీ మంగళ, గురువారాల్లో, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతిరోజూ నిర్వహిస్తారు. ఇందులో సేవలందించేందుకు జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, డెర్మటాలజిస్ట్ తదితర వైద్యులు ఓపీలో అందుబాటులో ఉండాలి. వివిధ రకాల సమస్యలతో వచ్చే మహిళలకు అవసరమైన పరీక్షలు చేసి చికిత్స చేయడం వీరి విధి. సీరియస్ కేసులను హైదరాబాద్ రిఫర్ చేస్తారు.

సజావుగా సాగితే మేలు..

గతేడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ఎనిమిది రకాల వ్యాధులకు చికిత్స అందించడంతో పాటు అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేద మహిళలకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోంది. కేన్సర్ బాధితులు చికిత్స చేయించుకోవాలంటే రూ.లక్షలు ఖర్చు చేయాలి. కానీ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణతో పాటు చికిత్స అందిస్తున్నారు. బోనకల్, చెన్నూరు, కామేపల్లి, లంకాసాగర్, మంచుకొండ, ఎం.వి.పాలెం, ముదిగొండ, నేలకొండపల్లి, ఓల్డ్ కేఎంసీ ఆఫీస్ బిల్డింగ్, సుబ్లేడు, వేంసూర్, వైరా పీహెచ్‌సీల్లో ప్రతీ మంగళ, గురువారాల్లో ఈ సేవలు అందుతున్నాయి. ప్రత్యేక శిక్షణ తీసుకున్న మహిళా వైద్యులు అందుబాటులో ఉంటూ బాధితులను పరీక్షించి చికిత్స చేస్తున్నారు. అయితే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ కార్యక్రమానికి తరచూ ఆటంకం ఎదురవుతోంది. దీంతో ఆస్పత్రికి వచ్చే మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఇంతటి ప్రాముఖ్యత గల కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేకంగా వైద్యులను నియమించాలని, లేదంటే ఎంసీహెచ్‌లో ఉన్న వైద్యులను శాశ్వతంగా దీనికే కేటాయించాలని మహిళలు కోరుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో మహిళలకు అందిన వైద్యసేవలు

(గత నెల 26వ తేదీ వరకు)

బహిష్టు సమస్యలు	15,780
గర్భసంచి ఇన్‌ఫెక్షన్	6,865
మూత్రనాళం ఇన్‌ఫెక్షన్	767
సంతాన లేమి	599
రక్తహీనత	164
గర్భసంచిలో గడ్డలు	375
సుఖ వ్యాధులు	131
మొత్తం	24,681

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా మెరుగైన సేవలందిస్తున్నాం. కొంత కాలంగా వైద్యుల కొరతతో సమస్య ఉన్నా ఆటంకం ఎదురుకాకుండా చూస్తున్నాం. ప్రతీ మహిళకు పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందిస్తున్నాం. జిల్లాలోని 12 పీహెచ్‌సీల నుంచి రిఫరల్ కేసులు కూడా వస్తున్నాయి. జిల్లాలోని ఆరోగ్య మహిళ కేంద్రాల్లో కూడా అందే సేవలను మహిళలు వినియోగించుకోవాలి. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే మంచి ఫలితం ఉంటుంది.

– డాక్టర్ ప్రేమలత, ఆరోగ్య మహిళ నోడల్ అధికారి

కేన్సర్‌కు కూడా మెరుగైన చికిత్స..

ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధికి కూడా మెరుగైన చికిత్సలు అందించారు. ఇప్పటి వరకు వివిధ రకాల కేన్సర్ వ్యాధి 154 మందికి ఉన్నట్లు గుర్తించారు. అందులో బ్రెస్ట్ కేన్సర్ 56 మందికి, గర్భసంచి కేన్సర్ 51 మందికి, ఓరల్ కేన్సర్ ఇద్దరికి ఉన్నట్లు గుర్తించగా వారిలో 50 మందిని హైదరాబాద్ ఎస్‌ఎంజే ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే గతంలో ఎంతో ఉత్సాహంగా సేవలందించిన ఈ కార్యక్రమం క్రమంగా మసకబారుతోంది. మూడు నెలలుగా ఈ కార్యక్రమం గురించి పెద్దగా పటించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక వైద్యులను కేటాయించకపోవడంతో అనారోగ్యం బారిన పడిన మహిళలకు చికిత్స అందడం లేదు.

పెండింగ్ డీఏలు చెల్లిస్తాం



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ఉద్యోగ సంఘాల నాయకులు

- ఉద్యోగుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం
- మంత్రులు పొంగులేటి, తుమ్మల
- ఘనంగా సకల ఉద్యోగుల వనసమారాధన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి తుమ్మల, ఉద్యోగ సంఘాల నాయకులు

ఖమ్మం సహకారనగర్ : ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన డీఏలను క్రమపద్ధతిలో మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని చెరుకూరి వారి మామిడితోటలో ఆదివారం నిర్వహించిన సకల ఉద్యోగుల కార్తీక వన సమారాధన, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారని, ఆర్థికేతర ఇబ్బందులన్నీ వచ్చే మార్చి లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులు సహకరిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గత పాలకులు ఉమ్మడి ఖమ్మం జిల్లాను అశ్రద్ధ చేశారని, ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. గతంలో ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా టీచర్లకు బదిలీలు, పదోన్నతులు కల్పించిందని అన్నారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజలు తమకు మంచి పని చేసే అధికారులు, ఉద్యోగులను ఎప్పటికీ మరిచిపోరని అన్నారు. ఉద్యోగుల కష్టాన్ని, త్యాగాలను తమ ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అధికారుల కృషితోనే ప్రజలకు మంచి చేయగలిగానని, తనను నేటికీ ప్రజలు గుర్తిస్తున్నారంటే ఉద్యోగులే కారణమని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రతి అంశాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యతని, బాకీలను దశల వారీగా చెల్లిస్తూ ఉద్యోగులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్బంధ ప్రభుత్వం పోయి ప్రజాస్వామ్య ప్రభుత్వం వచ్చాక తమ హక్కుల గురించి ప్రశ్నించే స్వేచ్ఛ లభించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తమతో సుదీర్ఘంగా చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. గత పదేళ్లలో ఉద్యోగుల జేఏసీ లేదని, సర్వీస్ రూల్స్ లేవని, ప్రశ్నిస్తే ప్రతిబంధకాలు, క్రిమినల్ కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా, జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న అన్నం శ్రీనివాస రావు, వనజీవి రామయ్యను, సీనియర్ సిటిజన్, రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌టీఎఫ్, టీపీటీఎఫ్, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దేవరకొండ సైదులు, నాగిరెడ్డి, చావా రవి, టీఎన్జీవోస్ నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదన శ్రీనివాస్, జైపాల్, తాళ్లూరి శ్రీకాంత్, గంగవరపు బాలకృష్ణ, టీజీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్య నారాయణ, మోదుగు వేలాద్రి, వివిధ సంఘాల నాయకులు వై.వెంకటేశ్వర్లు, జి.వి. నాగమల్లేశ్వరరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ఉద్యోగులు

భద్రగిరిలో 'కార్తీక' సందడి

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. కార్తీక మాసంతోపాటు ఆదివారం కావడంతో భక్తులు భద్రగిరి బాట పట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను గోదావరి తల్లికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక క్యూలైన్ల ద్వారా అంతరాలయంలో స్వామివారి మూలమూర్తులను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు కిటకిటలాడాయి. రామాలయానికి అనుబంధంగా ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ప్రవచనం, సంగీత, నృత్య కార్యక్రమాలను నిర్వహించారు.

వైభవంగా రామయ్యకు అభిషేకం

దేవస్థానం అంతరాలయంలో ఆదివారం మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో సైతం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన కేయూ అథ్లెటిక్స్ మీట్

- పురుషుల చాంపియన్‌గా కేఎండీసీ జట్టు
- మహిళల చాంపియన్‌గా కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న కాకతీయ యూనివర్సిటీ పరిధి అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి బి.వెంకయ్య, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టోర్నమెంట్ చైర్మన్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎండీ. గౌస్, పీడీల సంఘం కార్యదర్శి డాక్టర్. బి.వెంకన్న, సీనియర్ పీడీలు ఏటీబీటీ ప్రసాద్, సావిత్రి, పి.శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, జె.ఉపేందర్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పురుషుల ఓవరాల్ చాంపియన్‌గా ఖమ్మం కవిత మెమోరియాల్ డిగ్రీ కళాశాల(అటానమ్) జట్టు 32 పాయింట్లతో నిలిచింది. మహిళల విభాగంలో కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాల జట్టు 48 పాయింట్లతో ట్రోఫీని కైవసం చేసుకుంది. వ్యక్తిగత చాంపియన్‌లుగా కేఎండీసీ ఖమ్మంకు చెందిన ఎ.గౌతమ్, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలకు చెందిన ఎ.మైథిలీని ఎంపిక చేశారు.

విజేతలు వీరే..

పురుషుల విభాగం 200 మీటర్ల పరుగులో ఎ.గౌతమ్, బి. కౌషయ్య(ఎల్‌బీ కాలేజీ వరంగల్) పి.సాయితేజ, 800 మీటర్ల పరుగులో ఎస్.గోపిచంద్(కేఎండీసీ), జి.ఉదయ్ కిరణ్(ఏబీవీ జనగాం), బి.నరేష్(కేయూ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్), 4X400 రిలేలో ఏబీవీ జనగాం, కిట్స్ వరంగల్, కేఎండీసీ వరంగల్, 4X100 రిలేలో కేఎండీసీ, మహిళల 200 మీటర్ల పరుగులో ఎ.మైథిలి, ఆర్.డిసౌజ, ఎం.మనీషా, 4X100 రిలేలో సింగరేణి మహిళా కళాశాల కొత్తగూడెం, టీటీడబ్ల్యూఆర్‌డీసీ కొత్తగూడెం, టీటీ డబ్ల్యూఆర్‌డీసీ ఖమ్మం, 800 మీటర్ల పరుగులో ఎం.ఇందు, ఎం.టాబు, కె. అశ్విని, 4X400 రిలేలో సింగరేణి మహిళా కళాశాల కొత్తగూడెం, టీటీడబ్ల్యూఆర్‌డీసీ ములుగు, టీటీడబ్ల్యూఆర్‌డీసీ ఉట్నూర్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.



పురుషుల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన కేఎండీసీ జట్టు

ఆహార తనిఖీలేవి..?

హోటళ్లు, రెస్టారెంట్లపై పర్యవేక్షణ అంతంతే

- 'స్పాట్ టెస్టింగ్' వాహనం ఉన్నా మూలకే..
- ఉమ్మడి జిల్లాలో కల్తీ ఆహారంపై కొరవడుతున్న నియంత్రణ
- శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరత



ఖమ్మంమయూరిసెంటర్: మారుతున్న జీవన శైలి, ఉరుకులు, పరుగుల జీవనంతో అత్యధిక శాతం జనాభా ఇంటి భోజనం కంటే హోటళ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితులే ఎక్కువగా ఎదురవుతున్నాయి. దీన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. చాలావరకు హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీ నిర్వాహకులు నాణ్యత లేని, నిల్వ ఉంచిన భోజనాలు, ఆహార పదార్థాలు అందిస్తూ ప్రజల అనారోగ్యాలకు కారకులవుతున్నారు. ఇదంతా కళ్ల ముందే జరుగుతున్నా.. ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది. నిత్యం తనిఖీల ద్వారా ఆహార నాణ్యతను పరీక్షించాల్సిన అధికారులు ఆ పని తమది కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారులు వస్తేనో.. వినియోగదారులు ఎవరైనా ఫిర్యాదు చేస్తేనో తప్ప అధికారులు కాలు కదపడం లేదు. ఇక ఫిర్యాదు అందిన వెంటనే తనిఖీ చేయాల్సి ఉన్నా మరుసటి రోజు తీరిగ్గా వెళ్తుండడంతో రెస్టారెంట్ల నిర్వాహకులకే మేలు చేస్తున్నట్టు అవుతోంది.

కొరవడుతున్న పర్యవేక్షణ

జిల్లాలో ఆహార తనిఖీలు లేవని, అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు ఉన్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వందల సంఖ్యలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు ఉన్నాయి. వీటిని నిరంతరం తనిఖీ చేయాల్సి ఉన్నా అధికారులు, సిబ్బంది కొరతతో ఆ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తున్నా.. ఉమ్మడి ఖమ్మం జిల్లా యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఫలితంగా పలు హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు నిల్వ ఉన్న మాంసం, పాడైన ఆహారం, బూజుపట్టిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారని తెలుస్తోంది.

సిబ్బంది కొరత

ఉమ్మడి జిల్లాలో ఫుడ్ సేఫ్టీ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆహార నాణ్యతను పరీక్షించి కల్తీని అరికట్టాల్సిన ఈ శాఖలో ఉమ్మడి జిల్లాకు ఒక్కరే అధికారి ఉండడం గమనార్హం. ఖమ్మం జిల్లాకు అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు చొప్పున, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు, జూనియర్ అసిస్టెంట్ ఒకరు, అటెండర్లు ముగ్గురు ఉండాలి. కానీ కేవలం గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక భద్రాద్రి జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఒకరు చొప్పున ఉండాల్సి ఉన్నా ఆ మూడు పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. ఖమ్మం జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టరే భద్రాద్రి జిల్లాలోనూ విధులు నిర్వర్తిస్తుండడం.. అదనంగా సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పగించడంతో తనిఖీలు ఎప్పుడో ఓ సారి తప్ప జరగడం లేదు.

మున్సిపల్ అధికారుల పట్టింపేది?

ఆహారంలో కల్తీ జరగకుండా ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు మున్సిపల్ అధికారులు సైతం పర్యవేక్షించాలి. కానీ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఇతర మున్సిపాలిటీల్లో అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేసిన దాఖలాలే లేవు. హోటళ్లు అపరిశుభ్రంగా ఉన్నాయనే అంశంపై ఫిర్యాదులు వచ్చినా తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

పేరుకే ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్..

ఆహారాన్ని పరీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం మైక్రో బయాలజీ ల్యాబ్ యూనిట్ మొబైల్ వాహనాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించింది. రూ.కోట్ల విలువైన ఈ వాహనాన్ని 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' పేరుతో జిల్లాకు పంపించింది. ఈ వాహనానికి డ్రైవర్‌తో పాటు టెక్నీషియన్, అటెండర్‌ను కేటాయించింది. అయితే, జిల్లా అధికారులు ఈ వాహనాన్ని ఆహార నాణ్యత పరీక్షలకు వినియోగించడం లేదు. ఎక్కడైనా ఆహారం కల్తీ జరిగిందని ఫిర్యాదు వస్తే వాహనంతో వెళ్లి పరీక్షించాల్సి ఉన్నా మరుసటి రోజు వెళ్తుండడంతో యాజమానులు జాగ్రత్త పడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం, సూర్యాపేట జిల్లాకు కేటాయించిన మొబైల్ వాహనంతో ఇటు పరీక్షలు చేయకపోగా.. ప్రజలకు అవగాహన కూడా కల్పించడం లేదు.

తనిఖీలు చేస్తున్నాం..



ఉమ్మడి జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేస్తున్నాం. నెలకు కనీసం 10 శాంపిళ్ల సేకరించి పరీక్షలకు పంపిస్తున్నాం. జిల్లాలో అధికారులు, సిబ్బంది కొరత ఉంది. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి జిల్లాలో కూడా నేనే తనిఖీలు చేసి శాంపిళ్లు సేకరించాలి. అదనంగా సూర్యాపేట జిల్లా బాధ్యత కూడా అప్పగించారు. అయినప్పటికీ తనిఖీలు మరింతగా పెంచుతాం.

– ఆర్.కిరణ్‌కుమార్, జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్

క్లుప్తంగా

'గ్రానైట్' సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణస్వీకారం తర్వాత సభ్యులను అభినందిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: గ్రానైట్ పరిశ్రమ కష్టాల్లో ఉన్న నేపథ్యాన కాపాడుకునేలా ప్రభుత్వం నుంచి రాయితీలు, సబ్సిడీలను సాధించుకునేందుకు ఐక్యంగా కృషి చేయాలని గ్రానైట్ పరిశ్రమల యజమానుల అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు పారా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పాటి బండ్ల యుగంధర్, నాయకుడు వేముల రవికుమార్ కోరారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులతో ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోటీ ఉన్నా ఆ తర్వాత అంతా కలిసి ఉంటే సమస్యల పరిష్కారం సులువవుతుందని తెలిపారు. ఈమేరకు ఉపాధ్యక్షుడు –1గా కొనకంచి శ్యామ్‌ప్రసాద్, సంయుక్త కార్యదర్శి–2గా చావా రామ్మూర్తి, సభ్యులుగా మావిలేటి అనిల్ కుమార్, బానోత్ లాల్‌ప్రతాప్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన కార్యదర్శి కమర్తపు గోపాలరావు, కోశాధికారి మారంరెడ్డి పరమేశ్వరరెడ్డితో పాటు పి.శ్రీనివాస్, జె.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



తగలబడుతున్న గుడిసె

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెంలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పూరి గుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన గుగులోతు తులసి, కుటుంబసభ్యులు రాత్రి భోజనాల తర్వాత నిద్రించారు. ఆ కాసేపటికి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపిస్తుండడంతో కుటుంబీకులు బయటకు వచ్చారు. స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో బాధితుల సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ ఉద్యోగులు చేరకుని మంటలను అదుపు చేశారు. అయితే, అప్పటికే రూ.1.50 లక్షల విలువైన గృహోపకరణాలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయని బాధితులు వాపోయారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు..

అశ్వారావుపేటరూరల్: అగ్ని ప్రమాదంలో ఓ పూరి గుడిసె దగ్ధమైన ఘటన ఆదివారం జరిగింది. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. మండలంలోని మొద్దులమడ గ్రామానికి చెందిన కాక వజ్రమ్మ దంపతులు పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలు చేలరేగి అంటుకున్నాయి. దీంతో పూరిల్లు కాలిపోయింది. బియ్యం, వంట సామగ్రితోపాటు దుస్తులు దగ్ధమయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

నంబర్ గేమ్‌తో వివాదాలు..

నేలకొండపల్లి : మండలంలోని అప్పలనరసింహాపురం గ్రామంలో యువత నంబర్ గేమ్‌తో పెడదారి పడుతున్నారు. ఇది ఇటీవల వివాదాలకు వేదికగా మారింది. ఊరి చివరలో యువత రెండు వర్గాలుగా విడిపోయి.. నంబర్ గేమ్‌లో మునిగిపోతున్నారు. దీంతో వారు చెడు మార్గం వైపు మళ్లుతున్నారని స్థానికులు వాపోతున్నారు. గత రెండు రోజుల క్రితం ఆట దగ్గర జరిగిన వివాదంతో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఒకరి పై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఆట పై పోలీసులు దృష్టి సారించకుంటే మరింత గొడవలు జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

విద్యారుణం ఇప్పిస్తానంటూ మోసం

వేంసూరు: విద్యార్థి చదువుకునేందుకు రుణం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి.. వేంసూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన జూపూడి మేరి, ఆమె కుమార్తె రమ్య, అల్లుడు పూర్ణతో కలిసి.. అదే కాలనీకి చెందిన గుగులోత్ కవిత కుమారుడికి ఎడ్యుకేషన్ లోన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి రూ. 80వేలు తీసుకున్నారు. రుణం ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వమంటే తననే బెదిరిస్తున్నారని బాధితురాలు కవిత ఫిర్యాదు చేయగా ఏఎస్‌ఐ జయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

పెనుబల్లి: మండలంలోని ఎడ్ల బంజర గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. పక్కా సమాచారం తో తనిఖీలు చేపట్టగా వారు పట్టుబడ్డారని, వీరి నుంచి రూ.62,260 నగదు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,144

ఉపాధ్యాయులకు శిక్షణ!



డైట్ కళాశాల

- విద్యార్థులకు మెరుగైన బోధన కోసం నిర్ణయం
- తొలుత ఆర్‌పీలకు.. వారి ద్వారా టీచర్లకు
- ఈనెలాఖరులోగా నిర్వహణకు 'డైట్' కసరత్తు

ఖమ్మం సహకారనగర్: సులువైన విధానాల్లో విద్యార్థులకు త్వరగా అర్థమయ్యేలా బోధించేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే విధుల్లో ఉన్న ఉపాధ్యాయులతో పాటు ఇటీవల కొత్తగా చేరిన టీచర్లకు కూడా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తుండడమే కాక విద్యార్థులకు నాణ్యమైన బోధన అదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు డైట్ కళాశాలల ద్వారా శిక్షణ ఇప్పించాలని నిర్ణయించగా.. ఈ నెలలో కార్యాచరణ మొదలుకానుంది. కాగా, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులందరికీ ఖమ్మం డైట్ ద్వారానే శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిసింది.

మొదట రిసోర్స్ పర్సన్లకు..

ఖమ్మం జిల్లాలో 81 కాంప్లెక్స్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మండలానికి ఆరుగురు చొప్పున రిసోర్స్ పర్సన్లను నియమించారు. వీరికి మొదటిగా డైట్ కళాశాలలో శిక్షణ ఇస్తారు. ప్రాథమిక పాఠశాలల విభాగంలో నలుగురికి, హైస్కూల్‌కు సంబంధించి ఇద్దరు ఆర్‌పీలకు శిక్షణ ఉంటుంది. అనంతరం వీరు కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు మరింత నాణ్యమైన విద్యనందించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని భావిస్తున్నారు.

మరింత ప్రభావవంతంగా..

డైట్ కళాశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఇచ్చే ఈ శిక్షణతో మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రధానంగా గణితం, ఆంగ్లం సబ్జెక్టుల విషయంలో ఇబ్బంది ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టగా.. ప్రైవేట్ పాఠశాలల్లో ప్రమాణాలకు తగినట్లుగా ఇక్కడ బోధించేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఉపయోగపడనుంది. తద్వారా విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడతారని భావిస్తున్నారు. ఇంగ్లిష్, గణితం సులువుగా అర్థమయ్యేలా బోధించాలని.. తద్వారా అత్యధిక మార్కులు సాధించేందుకు వీలుంటుందనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షణకు శ్రీకారం చుట్టింది.

ఏయే అంశాల్లో?

ఇప్పటికే తరగతి గదుల్లో వినూత్న రీతుల్లో బోధన జరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ టీవీలు, ఇంటర్నెట్, సైన్స్, ఇంగ్లిష్ ల్యాబ్‌ల ద్వారా బోధన చేపడుతున్నారు. ఇదే సమయాన ఉపాధ్యాయులకు అన్ని అంశాల్లో మరింత అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం శిక్షణకు సిద్ధమైంది. ప్రాథమిక పాఠశాలల స్థాయిలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, తెలుగు, ఇంగ్లిష్, గణితంలో.. హైస్కూల్ స్థాయిలో ఇంగ్లిష్‌లో బోధన, డిజిటల్ బోర్డుల వాడకంపై శిక్షణ ఇస్తారు.

అనుమతి రాగానే శిక్షణ..



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆరు అంశాలపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. ఇప్పటికే అనుమతి కోసం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు లేఖ రాశాం. అక్కడి నుంచి అనుమతి రాగానే ఈ నెలలో శిక్షణ మొదలయ్యే అవకాశముంది.

– సామినేని సత్యనారాయణ, డైట్ ప్రిన్సిపాల్, ఖమ్మం

విద్య కాషాయీకరణను వ్యతిరేకించాలి

- శాస్త్రీయ విద్య విధానానికి ఉద్యమించాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట లక్ష్మణ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్య కాషాయీకరణకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని, శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు జర్పుల ఉపేందర్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వ్విద్యాలయాలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. మత భావాలు గల పాఠ్యాంశాలను జాతీయ నూతన విద్యా విధానం పేరుతో తీసకొస్తోందని, దీనికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారినే నియమిస్తోందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీసం 10 శాతం, జీడీపీలో 6శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యా విధానం అమలు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ కూడా మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఫహీందాదా, రాష్ట్ర సమితి సభ్యులు చిన్నబాబు, జిల్లా నాయకులు అజిత్, వంశీ, సృజన్, పవన్‌సాయి, రణధీర్, కృష్ణ, చందు, హరీష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన బియ్యాన్ని చూపిస్తున్న అధికారులు

తల్లాడ : మండలంలోని మల్లవరం గ్రామంలో ఆదివారం అక్రమంగా నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. రేగళ్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి పేదల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని రాచబంటి కుమారి ఇంట్లో అక్రమంగా నిల్వ చేయగా, అజ్ఞాత వ్యక్తులు అందించిన సమాచారం మేరకు ఆర్ఐ భాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. 14 సంచుల్లో నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని శ్రీనివాసరావుపై '6 ఏ' కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

భద్రాచలంటౌన్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద రేషన్ షాపు నుంచి ఓ ఆటోలో అక్రమంగా రెండు క్వింటాల రేషన్ బియ్యం ఏపీ సరిహద్దు గ్రామమైన పురోషోత్తమపట్నానికి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎస్బీఎస్ఐ శ్రీనివాసరావు ఆటోను సీజ్ చేసి బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

గొర్రెల మందపై వీధికుక్కల దాడి

- ఏడు గొర్రె పిల్లలు మృతి



కుక్కల దాడిలో మృత్యువాత పడిన గొర్రె పిల్లలు

కారేపల్లి: గొర్రెల మంద పై వీధికుక్కలు దాడి చేసి ఏడు గొర్రె పిల్లలను చంపేసిన ఘటన కారేపల్లి బొడ్రాయి బజార్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కారేపల్లికి చెందిన గొర్రెల కాపరి యర్నాగి సతీష్ రాత్రివేళలో గొర్రెలను దొడ్డిలో తోలాడు. అర్ధరాత్రి సమయంలో వీధికుక్కలు పాకలోకి ప్రవేశించి దాడి చేసి ఏడు గొర్రె పిల్లలను చంపేయని ఆవేదన వ్యక్తం చేశాడు. నెల రోజుల క్రితం బొడ్రాయి బజార్‌లోనే జంగా మధుకు చెందిన గొర్రెల మందపై కూడా వీధికుక్కలు వీరంగం సృష్టించి 21 గొర్రెలను చంపేయగా, మరో 10 గొర్రెలను తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యువతి ఆత్మహత్య

ఇల్లెందు: చదువులో రాణించటం లేదని తల్లిదండ్రులు మందలించటంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగిన యువతి ఆదివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బాలాజీనగర్ పంచాయతీ సంజయ్‌నగర్‌కు చెందిన డి. ఉదయశ్రీ(19) పాల్వంచలోని ఓ ప్రైవేట్ కాలేజ్‌లో ఫార్మసీ చదువుతోంది. మంచి మార్కులు రావడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయినా మార్పు లేకపోవటంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

అన్న లేని జీవితం వద్దని తమ్ముడు..

ఇల్లెందు: అన్న లేని జీవితం తనకు వద్దని మథనపడుతూ ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని స్టేషన్ బస్తీకి చెందిన ఎస్‌కె.యాకుబ్‌పాషా(30) శనివారం రాత్రి సమయంలో తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. శనివారం భార్య పర్వీన్ తల్లిగారింటికి వెళ్లి ఆదివారం రాగా, అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్ మీరా ఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

అప్పుల బాధతో ప్రభుత్వ ఉద్యోగి..

దమ్మపేట: అప్పుల బాధను తట్టుకోలేక ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... అశ్వారావుపేట మండల కేంద్రానికి చెందిన ఉబ్బపల్లి నాగేశ్వరరావు(42) సత్తుపల్లిలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తన పిల్లల చదువుల కోసం అధికంగా అప్పులు చేశాడు. అప్పులు తీర్చడం భారంగా మారడంతో ఈ నెల 1న మందలపల్లి బస్‌స్టేషన్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు బాధితుడిని సత్తుపల్లి ఆస్పత్రికి తరలించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌కు తరలించగా, ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్సై బాలస్వామి తెలిపారు.

పురుగులమందు తాగి యువకుడు..

దమ్మపేట: తల్లి మందలించిన కారణంగా మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గంగులగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ములకలపల్లి మండలం చవిటిగూడెం గ్రామానికి చెందిన సోడెం అనిల్‌కుమార్(18) కొంతకాలంగా మండలంలోని దురదపాడు గ్రామంలోని బంధువుల ఇంటి వద్ద నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసగా మారి బాధ్యత లేకుండా తిరుగుతున్నాడు. అతడి ప్రవర్తనపై విసుగు చెందిన తల్లి జ్యోతి శనివారం అతడిని మందిలించింది. దీంతో మనస్తాపం చెంది గంగులగూడెంలోని బంధువుల ఇంటికి చేరుకుని, మద్యం మత్తులో పురుగులమందు తాగాడు. బంధువులు సత్తుపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్సై బాలస్వామి తెలిపారు.

84 కేజీల గంజాయి స్వాధీనం

సుజాతనగర్: కారులో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని తరలిస్తున్న గంజాయిని సుజాతనగర్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై జుబేదా బేగం ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లాలోని జహీరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు (ఒకరు మైనర్) కారులో 84 కిలోల గంజాయిని తరలిస్తున్నారు. ఈ నెల 2న నాయకులగూడెం గ్రామం వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. కారు డిక్కీలో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీలేరు అటవీ ప్రాంతం నుంచి యాదాద్రి జిల్లాకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. గంజాయి రవాణాలో మరో నలుగురి పాత్ర ఉన్నట్లు తెలిసిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వేదికపై వ్యవసాయ మంత్రి తుమ్మల, ఎంపీ బలరాం, ఎమ్మెల్యేలు కోరం, రాందాస్, తెల్లం, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు

అర్హులందరికీ ఇళ్లు

- వచ్చే పదేళ్లూ తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యమే
- ఆరు గ్యారంటీల అమలుకు స్మార్ట్‌కార్డు సంజీవని
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి
- త్వరలో రైతు భరోసా కూడా అందజేస్తాం : మంత్రి తుమ్మల



పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్

ఇల్లెందు: రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదల రాజ్యం అంటేనే.. ఇందిరమ్మ రాజ్యమని, ఆరు గ్యారంటీల అమలుకు స్మార్ట్ కార్డు సంజీవనిలా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేసి తీరతామన్నారు. పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని, డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసినవారికి కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. గత ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో 2 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల లోపు రుణ మాఫీ చేశామని తెలిపారు. వచ్చే డిసెంబర్‌లోగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాయకత్వంలో మిగతా రుణమాఫీ కూడా పూర్తిచేస్తామన్నారు.

సీసీఐ ద్వారా పత్తి, మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొంటాం : తుమ్మల

మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని, పత్తి దిగుబడి తగ్గిందని సీసీఐ ద్వారా కొనుగోలు చేయిస్తామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, కో ఆపరేటివ్, టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సభలో ఆయన మాట్లాడుతూ రైతాంగానికి రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు ఉంటాయని చెప్పారు. తాను ఏ ప్రభుత్వంలో ఉన్నా ఈ ప్రాంతంతోపాటు గుండాల, ఆళ్లపల్లి, పినపాక, చర్ల, వెంకటాపురం వంటి మారుమూల గిరిజన ఆదివాసీ ప్రాంతాల అభ్యున్నతికి కృషి చేశానని తెలిపారు. ఖమ్మానికి టీసీపో నివిధంగా అభివృద్ధి చేశామని వివరించారు. నిమ్మవాగు, భీమునిపాదం చెరువు, తులారం ప్రాజెక్టులు నిర్మించామని తెలిపారు. 62 అభివృద్ధి పనులు చేపడితే మరో 11 వరకు అనుమతులు లేని కారణంగా నిలిచిపోయాయని, త్వరలో అన్ని పూర్తవుతాయని అన్నారు. త్వరలో రైతు భరోసా కూడా అందజేస్తామని, సబ్ కమిటీలో పొంగులేటి, భట్టి, తాను ఉన్నామని, త్వరలో ఓ కీలక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, సన్న ధాన్యంకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు వివరించారు. ఇల్లెందు మార్కెట్ జిల్లాలోనే అతి పెద్ద మార్కెట్‌గా ఉందని, రైతులకు ఉపయోగపడేలా సద్వినియోగపర్చాలని నూతన పాలకవర్గాన్ని మంతి తుమ్మల కోరారు.

ప్రమాణ స్వీకారం..

అనంతరం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్ పాలకవర్గ చైర్మన్ బానోతు రాంబాబు, వైస్ చైర్మన్ బిజ్జ వెంకటేశ్వర్లు, ఇతర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, మాలోతు రాందాస్‌నాయక్, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, వ్యవసాయ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, భరత్ చంద్రారెడ్డి, మధుకర్ రెడ్డి, మేకల మల్లిబాబు యాదవ్, యదళ్లపల్లి అనసూర్య, చీమల నాగరత్నమ్మ, బొర్రా రాజశేఖర్, పగడాల మంజుల, జాటోత్ జాన్సీ, దానియేల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మంత్రులను ఘనంగా సత్కరించారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్ హయాంలో 19.30 లక్షల ఇందిరమ్మ ఇళ్లు..

నియోజకవర్గానికి 3500 ఇళ్లు కాదని, వచ్చే నాలుగేళ్లలో 15 వేల ఇళ్లు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇందిరమ్మ పథకంలో 19.30 లక్షల ఇళ్లు కట్టించారని గుర్తు చేశారు. తాము రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఈ నెల 6 నుంచి జరిగే కులగణన దేశానికి రోల్ మోడల్‌గా ఉంటుందని, దీనికి రాజకీయ ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. జిల్లాలో ప్రతీ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ విద్యాలయం రాబోతుందన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేయబోతున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, గడిచిన పదేళ్లలో తండ్రీ కొడుకులు ఏనాడూ ప్రజల మధ్య తిరగలేదని, ఇప్పుడైనా ప్రజల మధ్యకు వచ్చి తిరిగితే వారి గోడు తెలుస్తుందన్నారు. ఆరోగ్యానికి కూడా మంచిదని సలహా ఇచ్చారు. పాదయాత్ర ద్వారా ప్రజల మధ్యకు వెళ్లాలని జ్ఞానోదయం అయినందుకు స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మున్సిపల్ ఉద్యోగి మృతి



షేక్ సైదులు (ఫైల్)

వైరా/బోనకల్: వైరా మున్సిపాలిటీలో పని చేస్తున్న ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మున్సిపాలిటీ నాలుగో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ సైదులు (53) వారం రోజుల క్రితం మధిర వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రెబ్బవరం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సైదులుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సైదులు మృతదేహానికి మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ చింతల వేణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైదులు స్వగ్రామం బోనకల్ మండలం రావినూతల కాగా, ఉద్యోగ నిమిత్తం వైరా బ్రాహ్మణపల్లిలో ఉంటున్నాడు.

గుర్తు తెలియని యువకుడు..



మృతదేహం వద్ద పోలీసులు, అన్నం శ్రీనివాసరావు

ఖమ్మం క్రైం : ఖమ్మం రైల్వే పోలీస్ పరిధిలోని వాణి ఐటీఐ వద్ద ఓ గుర్తు తెలియని యువకుడు(30) ఆదివారం రైల్లో నుంచి జారిపడి మృతిచెందాడు. ఖమ్మం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కర్రి శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ప్రసన్న కుమార్ సమాచారం అందించగా అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ..



గుర్తు తెలియని మృతదేహం

బోనకల్: మండల కేంద్రంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలుకింద పడి తీవ్ర గాయాలైన విషయం విదితమే. సుమారు 40 సంవత్సరాల వయసు గల ఆ వ్యక్తి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని ఖమ్మం జీఆర్పీ ఎస్ఐ పి.బాస్కర్‌రావు తెలిపారు. మృతదేహాన్ని ఖమ్మం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, అతడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని పేర్కొన్నారు.

ఇసుక లారీ సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని గుర్రాలకుంట శివారు ముర్రేడు వాగు నుంచి లారీలో ఇసుక తరలిస్తుండగా సీతారాంపురం శివారులో పట్టుకున్నారు. ఇసుక తోలకానికి అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలిస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒక నెలతో సరి.. ఒకటో తేదీ జీతాల్లేవ్

- ఏపీలో 2 లక్షలమంది ఉపాధ్యాయుల్లో ఆందోళన
- పెన్షనర్లకూ తప్పని ఆర్థికకష్టాలు

సాక్షి, అమరావతి: తమది ఉద్యోగుల ప్రభుత్వమని, అందరికీ ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం వేతనాలివ్వడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అధికారంలోకి వచ్చాక జూలై నెలలో మాత్రమే ఒకటో తేదీన జీతాలిచ్చారని, తర్వాత నెలల్లో ఐదు, ఆరు తేదీల్లోనే వేస్తున్నారని తెలిపారు. ప్రతినెలా మంగళవారం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు రెండులక్షల మంది ఉపాధ్యాయులకు అక్టోబర్ నెల వేతనాలను నవంబర్ ఒకటో తేదీన ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు జమ చేయలేదు. పెన్షన్లు కూడా అందరికీ అందలేదు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, మొదటి నెలలో మాత్రం ఒకటో తారీకు జీతాలు చెల్లించి, తర్వాత ప్రతినెలా 4, 5, 6, తారీకుల్లో జీతాలు ఇస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులు, ఈఎంఐ వంటి అవసరాలతో ఇబ్బందిపడుతున్నామని పేర్కొంటున్నారు. ఒకటో తేదీన వేతనాలు ఇవ్వకపోవడంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించలేక డిఫాల్టర్లుగా మారుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పెన్షన్ సొమ్ముతో జీవనం సాగిస్తున్నవారి పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. ఉపాధ్యాయులకు ఇప్పటివరకు పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవులు జమచేయలేదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, గెడ్డం సుధీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము దాచుకున్న డబ్బును ఇవ్వకపోతే తమ పిల్లల చదువులు ఏం కావాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. డబ్బులు అప్పు తెచ్చి ఎంతకాలం వడ్డీలు చెల్లించాలని ప్రశ్నించారు.

హంసలదీవిలో డాల్ఫిన్ల సందడి

కృష్ణానది సముద్రంలో కలిసేచోట కనువిందు



- వీటిని ఫొటోల్లో బంధించేందుకు ప్రకృతి ప్రేమికుల ఆసక్తి
- మన సముద్ర తీరాల్లో తరచుగా కనిపిస్తున్న హంప్ బ్యాక్ డాల్ఫిన్లు
- ఇవే తీరానికి దగ్గరగా వచ్చే డాల్ఫిన్ జాతులు
- విశాఖ, సూర్యలంక, కాకినాడ తీరాల్లోనూ ఇవి సాధారణమంటున్న నిపుణులు
- బాటిల్‌నోస్, పార్‌పోయిస్ జాతి డాల్ఫిన్లు కూడా మన తీరంలో సర్వసాధారణం

సాక్షి, అమరావతి : సాగర సంగమ తీరంలో డాల్ఫిన్లు కనువిందు చేస్తున్నాయి. కృష్ణాజిల్లా హంసలదీవిలో ఇవి తరచూ కనిపిస్తున్నాయి. ఇది కృష్ణా నది సముద్రంలో కలిసేచోటు కావడంతో అవి ఎక్కువగా ఈ ప్రాంతంలో కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఇవి గుంపులు గుంపులుగా తిరుగుతూ అప్పుడప్పుడు సముద్ర తీరానికి దగ్గరగా వస్తున్నాయని.. ఒక్కో గుంపులో 15 నుంచి 30 వరకూ ఉంటూ కనిపిస్తాయని వారంటున్నారు. విశాఖపట్నం, బాపట్లలోని సూర్యలంక, కాకినాడ బీచ్‌ల్లోనూ ఈ డాల్ఫిన్లు ఎక్కువగా కనిపిస్తాయి. తాజాగా.. ఆదివారం విజయవాడ నేచర్ క్లబ్‌కు చెందిన డాక్టర్ కిషోర్ హంసలదీవి వద్ద సముద్రంలో రెండు డాల్ఫిన్లను తన కెమెరాలో బంధించారు.

తూర్పు తీరంలో ఇవి సర్వ సాధారణం..

హిందూ మహా సముద్రంలో కనిపించే వీటిని హంప్ బ్యాక్ డాల్ఫిన్లుగా పిలుస్తారు. మన దేశ తూర్పు, పశ్చిమ తీరాల్లో ఇవి కనిపించడం చాలా సాధారణం. అయితే, తూర్పు, పశ్చిమ తీరాల్లో కనిపించే డాల్ఫిన్ల మధ్య జన్యుపరంగా స్వల్ప తేడాలుంటాయి. హంప్ బ్యాక్ డాల్ఫిన్లు ముదురు బూడిద రంగులో ఉంటాయి. వాటి ఉపరితల భాగం చాలా చిన్నదిగా కనిపిస్తుంది. వాటికి ఎత్తయిన మూపురం ఉంటుంది. సముద్రంలో డాల్ఫిన్ల మూపురం బయటకు కనిపిస్తుంది. వాటి ఆధారంగానే డాల్ఫిన్లను గుర్తిస్తారు. ఒక పెద్ద హంప్ బ్యాక్ డాల్ఫిన్ పొడవు సుమారు 3.5 మీటర్లు ఉంటుంది. కొత్తగా పుట్టిన డాల్ఫిన్లు కూడా ఒక మీటర్ పొడవు ఉంటాయి. వాటిలో ఆడ, మగ గురించి మాత్రం సరైన అధ్యయనాల్లేవు.

తీరానికి దగ్గరగా వచ్చే డాల్ఫిన్లు ఇవే..

ఇక డాల్ఫిన్లు మన సముద్ర తీరంలో కనిపించడం సర్వ సాధారణం. అయితే, వాటిల్లో తీరానికి దగ్గరగా కనిపించేవి హంప్‌బ్యాక్ డాల్ఫిన్లు మాత్రమే. మిగిలిన డాల్ఫిన్ జాతులు సముద్రంలోనే ఇంకా లోతులో ఉంటాయి. డాల్ఫిన్ల గురించి అధ్యయనం చేసేవాళ్లు, చూసేవాళ్లు లేకపోవడంవల్ల వాటి గురించి పెద్దగా బయటకు తెలీడంలేదు. చూసేవాళ్లకు మాత్రం అవి రెగ్యులర్‌గా కనిపిస్తూనే ఉంటాయి. సూర్యుడు ఉదయించే సమయాల్లో అవి తీరానికి దగ్గరగా వస్తాయి. బాటిల్‌నోస్, పార్‌పోయిస్ జాతులు కూడా తూర్పు తీరంలో తరచూ కనిపిస్తాయి. బాటిల్‌నోస్ జాతి కొంచెం లోతున్న ప్రాంతాల్లో కనిపిస్తాయి. పార్‌పోయిస్ జాతి డాల్ఫిన్లు కూడా తీరానికి దగ్గరగా వస్తాయి. కానీ, మిగిలిన వాటిల్లా వాటికి వెన్నురెక్క ఉండదు. అందుకే అవి బయటకు కనపడవు. శీతాకాలంలో స్పిన్నర్ డాల్ఫిన్లు (పైకి ఎగిరి నీటిలో పడేవి) విశాఖలో తీరంలో కనిపిస్తాయి. డాల్ఫిన్లు, తిమింగలాలు చనిపోయి లేదా దెబ్బతగిలి ఒడ్డుకు కొట్టుకువస్తే వాటి వివరాలు సేకరించి అటవీ శాఖకు సమాచారం ఇస్తున్నాం.

– ప్రణవ్, ఈస్ట్ కోస్ట్ కన్జర్వేషన్ టీమ్

సమూహాలుగా తిరుగుతాయి..

నిజానికి.. ఇవి సముద్రంలో సమూహాలుగా తిరుగుతాయి. 50 నుంచి 100 డాల్ఫిన్లు ఒకేచోట ఉంటాయి. వాటిలోనే కొన్ని చిన్న గుంపులుగా విడిపోయి సంచరిస్తాయి. మన తూర్పు తీరంలోని నదీ ముఖ ద్వారాలు, నదీ ముఖాల చుట్టూ ఉన్న తీరాలకు 1.5 కిలోమీటర్ల దూరం, 10–20 మీటర్ల లోతులో ఇవి సంచరిస్తాయి. సముద్రంలో ఉండే పలు రకాల చేపలను తిని ఇవి జీవిస్తాయి. ఇక దెబ్బలు తగిలినప్పుడు, చనిపోయినప్పుడు ఇవి తీరానికి కొట్టుకొస్తాయి. అప్పుడప్పుడు ఇవి మత్స్యకారుల వలలకు చిక్కుతాయి. హంప్‌బ్యాక్ డాల్ఫిన్లు మన దేశంలో పశ్చిమ తీరం వెంబడి గుజరాత్ నుండి కేరళ, తమిళనాడు నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఎక్కువగా కనిపిస్తాయి.

తక్షణమే సెలవుపై వెళ్లండి!

▶ మొదటి పేజీ తరువాయి

గత నెలలో నిర్వహించిన ఓ సమీక్షలో మంత్రులు ఆదేశించడంతో ప్రాజెక్టు అధికారులు తొందరపడి టెండర్లను ఆహ్వానించినట్టు తెలుస్తోంది. అయితే తక్షణమే టెండర్లు నిర్వహించాలని మంత్రులు ఆదేశించిట్టు మీటింగ్ మినట్స్‌లో సైతం ఉందని, అందుకే ఆహ్వానించట్టు బాధ్యులైన అధికారులు పేర్కొంటున్నారని సమాచారం. కాగా పాలనాపరమైన అనుమతులే కాకుండా ఆర్థిక శాఖ ఆమోదం కూడా లేకుండా టెండర్లను ఆహ్వానించడం నిబంధనల తీవ్ర ఉల్లంఘనే అని నీటిపారుదల శాఖలో చర్చ జరుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నాగార్జునసాగర్ కాల్వకు గండ్లుపడగా, పాలనాపరమైన అనుమతుల జారీ తర్వాతే అత్యవసర మరమ్మతులు చేపట్టారని, అనుమతుల విషయంలో మినహాయింపు ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

అనుమతుల్లేకుండా బిడ్లను ఎలా తెరుస్తారు ?

డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు సంబంధించిన ఆరు టెండర్లకు ఈ నెల 8తో, ఒక టెండర్‌కు ఈ నెల 4తో బిడ్ల దాఖలు గడువు ముగియనుంది. కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ)లోని చీఫ్ ఇంజనీర్ల కమిటీ బిడ్లను పరిశీలించి ఎల్–1 బిడ్డర్‌ను ఖరారు చేయాల్సి ఉంటుంది. అయితే సంబంధిత పనులకు పాలనాపరమైన అనుమతులు, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా బిడ్లను తెరిచి పరిశీలించడానికి నిబంధనలు ఒప్పుకోవని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగి ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారో పరిశీలించి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు.

టెండర్లపై రాజకీయ రగడ

- ఇప్పుడు మీపై ఏ కమిషన్ వేయాలి?: కేటీఆర్

పాలనాపరమైన అనుమతుల్లేండానే సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలు, ఇతర పనులకు అధికారులు టెండర్లను ఆహ్వానించినట్టు వెలుగులోకి రావడంతో రాజకీయ రగడ ప్రారంభమైంది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 మధ్య ఏడు పనులకు రూ. 1,842 కోట్ల అంచనాతో నీటిపారుదల శాఖ టెండర్లను ఆహ్వానించగా, అందులో రూ. 1,074 కోట్ల పనులకు పాలనాపరమైన అనుమతుల్లేవంటూ ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. వార్తా కథనాన్ని షేర్ చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుల మీద పగబట్టి హాహాకారాలు చేస్తూ బురదజల్లిన వారు..అనుమతి లేకుండానే రూ.1,074 కోట్ల పనులకు టెండర్లు ఎలా పిలుస్తారంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజాపాలన అని రోజుకు పదిమార్లు ప్రగల్భాలు పలికేటోళ్లు ఇలా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఒక సమావేశంలో త్వరగా టెండర్లు పిలవాలని ఆదేశించి, మరో సమావేశంలో ఇదేంటి అంటూ నంగనాచి మాటలు మాట్లాడడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు పూర్తయ్యి కోటి ఎకరాలకు జీవం పోస్తున్న కాళేశ్వరంపై కమిషన్ వేసి విచారణ జరిపిస్తున్న మీపై.. ఇప్పుడు ఏ కమిషన్ వేయాలని ప్రశ్నించారు.

ఢిల్లీ నేస్తం..అవినీతి హస్తం

కాళేశ్వరంపై కక్షగట్టి రైతుల పొట్టగొట్టారని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల మీద పగబట్టి మళ్లీ వలసలకు పచ్చజెండా ఊపారని కేటీఆర్ మండిపడ్డారు. ఢిల్లీ నేస్తం–అవినీతి హస్తం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.7,926.14 కోట్ల అంచనాతో 2016 ఫిబ్రవరి 18న పాలనాపరమైన అనుమతులివ్వగా, ఆ తర్వాత 2018 ఆగస్టులో అప్పటి ప్రభుత్వం రూ.13,057 కోట్లకు అంచనాలను సవరించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీనిని తప్పుబడుతూ రాష్ట్ర మంత్రులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే విషయాన్ని ఇప్పుడు గుర్తుచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

ఇది రాజ్యాంగంపై నేరుగా దాడే

- సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులపై వైఎస్ జగన్ మండిపాటు
- వారిని నిర్బంధించడం ప్రాథమిక హక్కులను కాలరాయడమే
- పోలీసుల అధికార దుర్వినియోగం క్షమార్హం కాదు
- వీటిని ఆపకపోతే హక్కుల పరిరక్షణకు చట్టపరంగా చర్యలు



సాక్షి, అమరావతి: టీడీపీ నేతల ప్రోద్బలంతో రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా నిర్బంధించడాన్ని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన "ఎక్స్" ఖాతాలో తీవ్రంగా ఖండించారు. దీన్ని తక్షణం ఆపకుంటే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. "సోషల్ మీడియా కార్యకర్తలను నిర్బంధించడం అంటే వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమే.. రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేయడమే. టీడీపీ నాయకుల ప్రభావంతో, రాజకీయ ప్రేరేపిత చర్యల్లో భాగంగా సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేసి, కస్టడీలో వారి పట్ల అమానవీయంగా ప్రవర్తించడం అన్ని ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా ఉల్లంఘించడమే. పోలీసుల అధికార దుర్వినియోగం క్షమించరానిది. భావవ్యక్తీకరణ హక్కులకు విరుద్ధమైనది. ఈ రాజకీయ ప్రేరేపిత చర్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. వీటిని తక్షణమే ఆపకుంటే సోషల్ మీడియా కార్యకర్తల హక్కులను పరిరక్షించడానికి, చట్టపరమైన చర్యలను తీసుకోవడానికి ఏమాత్రం వెనుకాడబోం" అని హెచ్చరించారు.

ఢిల్లీలో కొనసాగుతున్న గ్యాంగ్‌ల బెదిరింపుల పర్వం

వ్యాపారి ఇంటిపైకి కాల్పులు జరిపిన షోకీన్ గ్యాంగ్

న్యూఢిల్లీ: తిహార్ జైలులో గడుపుతున్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కు పోటీగా మరికొన్ని గ్యాంగ్‌లు ఢిల్లీలో బెదిరింపులకు పాల్పడుతున్నాయి. బెదిరింపులకు సంబంధించిన వీడియో ఒకటి తాజాగా బహిర్గతమవడంతో గ్యాంగ్‌ల మధ్య పోటీ విషయం మరోసారి చర్చనీయాంశమైంది. రూ.15 కోట్ల నగదు బెదిరింపుల అంశం వెలుగులోకి వచ్చినవేళ ఈ అంశం బయటకురావడం గమనార్హం. కౌశల్ చౌదరి అనే గ్యాంగ్‌స్టర్ ప్రస్తుతం గురుగ్రామ్ జైలులో ఉన్నాడు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఇతని గ్యాంగ్‌కు శత్రుత్వం ఉంది. తన గ్యాంగ్‌ను విస్తరించేందుకు చౌదరి తోటి పవన్ షోకీన్ గ్యాంగ్‌తో చేతులు కలిపాడు. వ్యాపారులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నాడు. గత నెల 26న ఢిల్లీలోని రాణీబాగ్‌లో ఒక వ్యాపారి ఇంటి మీదకు ఒక షూటర్ కాల్పులు జరిపిన వీడియో తాజాగా బయటికొచ్చింది. అమెరికాలో ఉంటున్న షోకీన్ ఆదేశాల మేరకు 'బాంబిహా గ్యాంగ్'సభ్యులు ఇద్దరు అక్టోబర్ 26న ఒక వ్యాపారి ఇంటి వద్దకు వచ్చి అందులో ఒకడు 'బాంబిహా గ్యాంగ్'అని రాసి ఉన్న ఒక చిట్టీని ఇంటి ప్రాంగణంలోకి విసిరాడు. ఈ తతంగాన్ని అంతా తన మొబైల్‌లో వీడియోతీసి అమెరికాలో ఉంటున్న గ్యాంగ్‌స్టర్ పవన్‌కు పంపించాడు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు పోటీగా నిధులు సమీకరించేందుకే ఈ ఢిల్లీ వ్యాపారిని బెదిరిస్తున్నట్లు సమాచారం.

జిల్లా వార్తలు

హైదరాబాద్‌లో అంతర్జాతీయ టోర్నీ !

- వచ్చే ఏడాది మొదట్లో బాడీ బిల్డింగ్ పోటీలు
- వేయి మంది క్రీడాకారులు హాజరవుతారని అంచనా
- ఐబీబీఎఫ్ అధ్యక్షుడు స్వామి రమేష్‌కుమార్



ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ టోర్నీ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని ప్రముఖ న్యాయవాది, ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్(ఐబీబీఎఫ్) అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన స్వామి రమేష్‌కుమార్ తెలిపారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలో టోర్నీ నిర్వహించాలనే ఆలోచన ఉందని వెల్లడించారు. ఫెడరేషన్ అధ్యక్షుడిగా తెలుగు రాష్ట్రాల నుంచి తొలిసారిగా రమేష్‌కుమార్‌కు అవకాశం దక్కడం.. ఆయన ఖమ్మం జిల్లా వాసి కావడంతో క్రీడా సంఘాలు, క్రీడాకారుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈసందర్భంగా ఇటీవల ఖమ్మం వచ్చిన ఆయనను 'సాక్షి' పలకరించగా పలు వివరాలు వెల్లడించారు.

63 దేశాల నుంచి క్రీడాకారులను రప్పిస్తాం...

ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఉన్న పాల్చువా వరల్డ్ బాడీబిల్డింగ్ అధ్యక్షుడిగా ఎన్నికవడంతో జాతీయ స్థాయిలో ఎన్నికలు అనివార్యమయ్యాయని రమేష్‌కుమార్ తెలిపారు. ఈమేరకు 17 సభ్యులతో కూడిన కమిటీ నాలుగేళ్ల కాలానికి తనను ఎన్నుకుందని వెల్లడించారు. కాగా, హైదరాబాద్ వేదికగా 2025లో అంతర్జాతీయ టోర్నీ నిర్వహణకు సిద్ధమవుతున్నామని తెలిపారు. దాదాపు 63 దేశాల నుంచి వేయి మంది క్రీడాకారులను రప్పించాలన్నది లక్ష్యమని చెప్పారు. ఖమ్మం వేదిగా ఎన్నో జాతీయస్థాయి టోర్నీల నిర్వహణకు సహకరించిన మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, రఘురాంరెడ్డి హైదరాబాద్‌లో జరిగే టోర్నీకి కూడా తోడ్పాటునందిస్తామన్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి...

ఒకప్పుడు కొందరు స్టెరాయిడ్స్ తీసుకుని క్రీడాపోటీల్లో పాల్గొనేవారని.. కానీ ఇప్పుడు గ్రోత్ హార్మోన్స్ పేరిట స్టెరాయిడ్స్ వస్తున్నందున యువత అప్రమత్తంగా ఉండాలని రమేష్‌కుమార్ సూచించారు. విజయం కోసం ఇలాంటివి వాడితే ఒకే టోర్నీతో భవిష్యత్ ముగిసిపోతుందని చెప్పారు. గ్రోత్ హార్మోన్స్ వాకడంతో 16ఏళ్ల బాలుడు 26 ఏళ్ల యువకుడిగా, 26ఏళ్ల యువకుడు 40పైగా వయస్సు దాటిన వారిగా కనిపిస్తున్నారని తెలిపారు. ఇక నెలలోనే శరీరాన్ని తీర్చిదిద్దుతామని చెప్పే ప్రచారాన్ని నమ్మొద్దని హితవు పలికారు. బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనేలా శరీరాన్ని సిద్ధం చేయాలంటే కనీసం పదేళ్లు పడుతుందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వరుసగా మూడుస్థానాల్లో నిలిచిన వారి నుంచి మూత్రం నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతారని.. ఒకవేళ అందులో నిషేధ పదార్థాలు వాడినట్లు తేలితే పతకాలు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. కాగా, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న వారికి రైల్వే, పోస్టల్, ఆదాయ పన్ను శాఖల్లో ఉద్యోగాలకు అవకాశమున్నందున చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని రమేష్‌కుమార్ సూచించారు.

కలుపు మొక్కలకు కళ్లెం!

- మెట్టపంటల్లో 'మల్చింగ్'తో మంచి ఫలితాలు
- మిర్చి తోటల్లో అవలంబిస్తున్న రైతాంగం
- నీటి ఆదాకు తోడు పెరుగుతున్న దిగుబడి



చేనులో ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్ పరుస్తున్న కూలీలు (ఫైల్)

కామేపల్లి: కాలానుగుణంగా వ్యవసాయం మారుతోంది. సంప్రదాయ పంటలను వీడకున్నా.. సాగులో మాత్రం ఆధునిక విధానాలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా మెట్ట పంటల్లో కలుపు నివారణ కోసం మల్చింగ్ షీట్ల వినియోగం నానాటికీ పెరుగుతోంది. ఈ విధానంలో పెట్టుబడి తగ్గడంతో పాటు తెగుళ్ల, పురుగుల బెడద పెద్దగా ఉండడం లేదని చెబుతున్నారు. అంతేకాక తేమ నిలిచి ఉండడంతో తక్కువ నీటితో పంట చేతికొస్తోంది. మల్చింగ్ విధానంపై అవగాహన పెరుగుతుండడంతో అవలంబిస్తున్న రైతుల సంఖ్య ఏటా పెరుగుతోంది.

బహుళ ప్రయోజనాలు

మెట్ట పంటల్లో మల్చింగ్ షీట్లు వేయడం వల్ల అనేక ఫలితాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. నీటి ఆదా నుంచి మొదలు చీడపీడల నిర్మూలన వరకు రైతులకు మేలు జరుగుతుంది. ప్లాస్టింగ్ మల్చింగ్‌తో కలుపును 80 శాతం వరకు తగ్గుతుండగా.. షీట్ కింద గడ్డి మొలిచినా సూర్యకిరణాలు నేరుగా పడకపోవడంతో కిరణజన్య సంయోగ క్రియ నిలిచిపోయి మొక్క షీట్ కిందే మగ్గిపోతుంది. ఇక భూమిలో తేమ ఎక్కువ కాలంలో ఉంటున్న కారణంగా సాధారణ వినియోగంతో పోలిస్తే 50 శాతం వరకు ఆదా చేసుకోవచ్చు. భారీ వర్షాలు పడినా మొక్కలు నీరు పట్టిపోయి చనిపోవు. అలాగే, భూమి కోతకు గురికాకపోగా.. పంట దిగుబడి భారీగా పెరుగుతుందని చెబుతున్నారు.

తొలిదశలోనే ఖర్చు

మిర్చి తోటల్లో మల్చింగ్ విధానంపై రైతులు ఆసక్తి చూపిస్తుండడంతో మల్చింగ్ షీట్ పరిచేందుకు కూలీలకు డిమాండ్ ఏర్పడింది. ఒక్కోసారి మల్చింగ్ షీట్ లభించడం లేదని తెలుస్తోంది. రైతుకు మొదటి దశలోనే ఖర్చు ఉండగా.. ఆతర్వాత అనేక లాభాలు ఉండడంతో చాలా మంది ముందుకొస్తున్నారు. ఎకరాకు మల్చింగ్ లేకుండా మిరపలో కలుపుతీత, అరక, మందు వేయడం వంటి పనులకు సుమారు రూ.60 వేలకు పైగా ఖర్చు వస్తుంది. అదే ఈ ఖర్చులన్నీ గణనీయంగా తగ్గడమే కాక అరక దున్నే పని ఉండదు.



మల్చింగ్ విధానంతో సాగు చేసిన మిరప పంట



ఆశాజనకంగా ఉన్న మిరప పైరు

సబ్సిడీ కూడా ఇస్తే...

ఖమ్మం జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేసినట్లు ఉద్యానశాఖ గణాంకాలు చెబుతున్నారు. ఇందులో సుమారు 3,500 ఎకరాల్లో మల్చింగ్ విధానం అవలంబించారని అంచనా. జిల్లాలోని రఘునాథపాలెం మండలంలోనే 1,500 ఎకరాల్లో మల్చింగ్ వేయగా.. ఆతర్వాత స్థానంలో కామేపల్లి మండలం నిలుస్తోంది. అయితే, ప్రభుత్వం కేవలం 500 ఎకరాలకు మాత్రమే 50 శాతం సబ్సిడీపై మల్చింగ్ అందించింది. అలాకాకుండా ముందుకొచ్చే రైతులందరికీ సబ్సిడీ అమలుచేయాలని కోరుతున్నారు.

ఆసక్తి చూపుతున్నారు..



గతంతో పోలిస్తే మల్చింగ్ విధానంపై రైతులకు ఆసక్తి పెరిగింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఉండడమే కాక కలుపు నివారణ, కూలీల సమస్య ఎదురుకాదు. నీరు ఆదా కావడంతో పాటు దిగుబడి పెరుగుతోంది. ఇలా అనేక కారణాలతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

– ఆకుల వేణు, వైరా డివిజన్ ఉద్యాన అధికారి


సబ్సిడీపై ఇస్తే ప్రయోజనం



మిరప, బొప్పాయి, కూరగాయల తోటల్లో మల్చింగ్ వేస్తున్నా. ఈ విధానంలో కూలీల సమస్య, పెట్టుబడి తగ్గి పంట ఎదుగుదల ఆశాజనకంగా ఉంటోంది. ఈ ఏడాది మిరప తోటలో మల్చింగ్ వేశా. ప్రభుత్వం సబ్సిడీ అమలుచేస్తే రైతులకు ప్రయోజనంగా ఉంటుంది.

– బానోత్ వీరన్న, రైతు, పండితాపురం

ఆలయ నిర్మాణానికి రూ.2.30 లక్షల విరాళం



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి వీరిశెట్టి ప్రవీణ్‌కుమార్ – శ్వేత దంపతులు రూ.2.30లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు ప్రవీణ్‌కుమార్ ఆలయ కమిటీకి ఆదివారం నగదు అందించగా వారు సన్మానించారు. ఇందులో స్వామి వారి వెండి కిరీటం కోసం రూ.1.45 లక్షలు, ఆలయ శిఖరంపై దశావతారాల విగ్రహాల తయారీకి రూ.85వేలు ప్రవీణ్‌కుమార్ తన కుమార్తెలు సుష్మ, గ్రీష్మతో కలిసి తల్లి ఆదిలక్ష్మి పేరిట అందించారు. ఆలయ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, సోమిశెట్టి శ్రీధర్, ఉబ్బల వెంకటేశ్వరరావు, రాగాల చంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిడిగుండాలలో తడిసిన మొక్కజొన్న గింజల నుంచి నీటిని వేరు చేస్తున్న రైతులు



కొమరారంలో తడవడంతో మొలకెత్తిన మొక్కజొన్న గింజలు



అకాల వర్షం.. రైతుల ఆగమాగం

- తడిసిన మొక్కజొన్న.. నేలకొరిగిన వరి, మిర్చి పైర్లు
- మొక్కజొన్న మొలకెత్తుతుండడంతో ఆందోళన
- ఆరబెట్టుకునేందుకు అన్నదాత అష్టకష్టాలు

ఇల్లెందురూరల్: విత్తన దశలో వర్షాభావం, తెగుళ్ల ఉధృతిని రైతులు అధిగమించగా.. పంట చేతికి వచ్చే సమయాన అకాల వర్షం వారి ఆశలను అడియాసలు చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఇల్లెందు మండలంలో కురిసిన వర్షంతో కల్లంలో ఆరబెట్టుకున్న మొక్కజొన్న తడిసి ముద్దవగా వరి, మిర్చి పంటలు నేలవాలాయి. పత్తి మొక్క పైనే తడిసిపోవడంతో నాణ్యతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

మక్క రైతు కన్నీరు

ఇల్లెందు మండలంలో సుమారు 25వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైంది. ప్రస్తుతం కంకుల నుంచి గింజలను వేరు చేసి కల్లాల్లో ఆరబెట్టుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే దిగుబడి తగ్గిందని ఆవేదన చెందుతుండగా ఆదివారం కురిసిన వర్షంతో మామిడిగుండాల, మసివాగు, కొమ్ముగూడెం, కొమరారం, పోలారం తదితర గ్రామాల్లో రైతులు కల్లాలు, రోడ్ల వెంట ఆరబెట్టుకున్న మొక్కజొన్న తడిసిపోయింది. కొన్ని గ్రామాల్లో తడిసిన మొక్కజొన్న నుంచి మొలకలు కనిపించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేటు వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించి నష్టపోతున్నారు. ఇప్పుడు మొక్కజొన్నలు తడవడంతో ధరపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేలకొరిగిన వరి, మిర్చి

వరి కంకి దశను దాటి గింజ పోసుకునే దశకు చేరింది. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో కోత దశకు చేరుకుంది. మిర్చి మొక్కలు పూత దశకు చేరుకున్నాయి. ఈ తరుణాన వచ్చిన గాలివానతో మొక్కలు నేలకొరిగాయి. దీంతో మిర్చి రైతులు నేలవాలిన మొక్కలను సరిచేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇక వరి పొలాలను రక్షించాలని భగవంతుడిపైనే భారం వేసి ఆశగా ఎదురుచూస్తున్నారు.



రాజ్యతండాలో నేలవాలిన వరి



నేలకొరిగిన మిర్చి తోట